# చతుర మాసపత్రిక

1977 ఫిబ్రవరినుంచి ఈనాడు సంస్థ పాఠకులకి నెలనెలా ఒక నవలను అందిస్తోంది 'చతుర' మాసపత్రిక. అప్పటికే కొన్ని మాసపత్రికలు నెలనెలా ఒక నవలను అనుబంధంగా అందిస్తున్నప్పటికీ, నవలనే మాసపత్రికగా వెలువరించిన ఈ 'చతుర' వినూత్నప్రయోగం ఇటీవలే జయప్రదంగా 31 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. నవ్యతకూ, సామాజికస్పృహకూ పెద్ద పీట వేసే ఈ పత్రిక- నవరసాలు, మాండలికాల ఎన్నికలో రచయిత(త్రు)లకి పూర్తి స్వేచ్ఛనివ్వడం విశేషం. నవల 'చతుర'లో అచ్చులో 80-85 పేజీలకు మించకూడదని నియమం. నవలకు అక్షరాలా ఆరువేల రూపాయల పారితోషికం. అంచనాకు పాత 'చతుర' సంచిక తీసుకోవచ్చు. లేదా ఇంటర్నెట్లో ఈ లింకు ద్వారా పత్రిక చదవొచ్చు:

http://www.eenadu.net/cha-pdf/chaturamain.asp

తెలుగు సాహితి సుసంపన్నం కావడానికీ- రచయితల ప్రేరణకీ- అప్పుడప్పుడు పోటీలు కూడా నిర్వహించే 'చతుర'లో రచనలకి పాఠకుల స్పందన ఎక్కువగా లభించడం విశేషం. నవలకి ప్రాధాన్యమిచ్చినా- 'చతుర'లో ఆకర్షణీయమైన ఇతర శీర్షికలు కూడా ఉన్నాయి. మచ్చుకి ఫిబ్రవరి (2009) సంచిక పరిశీలిద్దాం.

ఈ సంచికలో నవల- భూమినే నమ్ముకుని బ్రతికే బక్క రైతుల జీవనచిత్రంలోని విషాదాన్ని పలికించిన వేంపల్లె గంగాధర్ రచన 'నేల దిగిన వాన'. శీర్షికల్లో విశిష్టమైనవి: కార్టూన్ బొమ్మకు పాఠకుల కాప్షన్ అడిగే 'కాప్షన్ మీదే' (పేజి 2); నెలనెలా ఓ మహాకవిని పరిచయం చేసే 'జ్ఞానపీఠాలు' (6), హ్యూమరాలజీ తరహాలో యర్రంశెట్టి సాయి 'అపార్ట్‌మెంటాలజీ' (8), అల్పాక్షరాల్లో అనల్పార్థాన్ని పల్కించే 'చతుర కతలు' (112), ప్రపంచ ప్రసిద్ధ నవలల పరిచయ వేదిక 'కాలాతీతం' (118), హైదరాబాదుకు ప్రత్యేకమైన 'టాంక్‌బండ్ కథలు' (126), 'కొత్తగాలి' పేరిట అడుగడుగునా అలరించే అర్థవంతమైన మినీ కవితలు. ఇవి కాక పత్రికలకి సాధారణమైన మరికొన్ని ఆసక్తికరమైన ఇతర శీర్షికలూ ఉన్నాయి.

వీటన్నింటి విలువా నెలకి పది రూపాయలు.